# రెడ్ హాండెడ్

అనూరాధ తలుపు గడియతీసి బైటికొచ్చింది.

ధడాలున ఎదురింటి తలుపులు మూసుకున్నాయి.

పక్క ఇంటి కిటికీ రెక్క ఠపీమని చప్పుడైంది.

రోజూ ఎదురొచ్చి టా,టా చెప్పే మూడేళ్ళ శ్వేత కనిపించలేదు.

పబ్లిక్ నల్లా దగ్గర నీళ్ళు పట్టుకునే ఆడవాళ్ళంతా విచిత్రంగా, అసహ్యంగా, అంటరానిదాన్ని చూస్తున్నట్టుగా చూస్తున్నారు.

వీధి చివర పాన్‌షాప్ వాడు పాన్ తినీ తినీ గారపట్టిన పళ్ళు కనిపించేలా, రోతగా నవ్వుతూ కళ్ళెగరేశాడు.

అనూరాధకి గుండెను పదునైన కత్తితో సన్నగా చీల్చి ఉప్పూ, కారం పెట్టినట్టు భరించరాని ఆ వాతావరణంలో కాళ్ళు చచ్చుపడినట్టయింది. చటుక్కున అటుగా పోతున్న ఆటో పిలిచి, అందులో కూర్చుని "గన్‌ఫౌండ్రీ" అన్నది నీరసంగా.

ఆటో కదిలింది.

కరెంట్ స్తంభం దగ్గర అసహ్యంగా నవ్వుతూ కాలరెత్తుకొని తను చేసిన ఆటవిక చర్యకు నిదర్శనగా నిలబడి ఉన్నాడు.

పొట్టిగా, లావుగా, గడ్డం పెంచి, బట్టతలతో సంధియుగానికి ప్రతీకలా... వికృతంగా...

ఆ భంగిమ చూసిన అనూరాధకి కడుపులో తిప్పింది.

సిగ్గు, అభిమానం, పౌరుషం... పశ్చాత్తాపం ఏమీలేని ఓ 'లోఫర్'

ఆ లోఫర్ చేసిన ఓ అనాగరికమైన పాశవికమైన చర్యని ఆ వీధిలో వాళ్ళంతా భావిస్తున్న తీరు ఎంత వండ్రఫుల్! అందంగా, సంస్కారమే ఆభరణంగా బ్రతికే అనూరాధ ఆ వీధిలో అందరికీ ఓ పజిల్. ఈమె వంటరిగా ఎందుకుం టుంది? తరచూ ఆమెని స్కూటర్ మీద తిప్పుతూ, అప్పుడప్పుడూ ఆమె ఇంట్లో

రెండేసి రోజులు మకాం ఉండే ఆ యువకుడు ఎవరు? భర్తే అయితే మెళ్ళో మంగళసూత్రాలేవి? ప్రియుడైతే...అలా తిరగడం ఏమిటి బరితెగించి... అతనేకాక అప్పుడప్పుడు చాలామంది మగవాళ్ళు ఆమె ఇల్లు విజిట్ చేస్తుంటారు. ఎందుకు? వాళ్ళంతా ఎవరు? ఎందుకొస్తారు? (ఆడవాళ్ళు కూడా వస్తుంటారు. కానీ మగవాళ్ళ రాకలని మాత్రం అబ్జర్వ్ చేసే జనాలకి ఆడవాళ్ళు కన్పించరు) ఒంటరిగా ఉండే ఆడదానింటికి మగవాళ్ళు రావడం ఏమిటి? ఈమె ప్రతి రోజూ లేట్‌గా వస్తుంటుంది ఎందుకు? ఈ రకమైన ఎన్నో మిస్టరీలు ఛేదించి, అవసరం అయితే ఈమెని ఈ కాలనీ నుంచి తరిమికొట్టాలి. అందుకు నాగరికత ముసుగు కప్పుకొన్న కొందరికి సాధ్యంకాదు కాబట్టి, ఆ భారం చూపులకీ, స్వభావానికీ కూడా అనాగరికుడైన "వాడికి" అప్పగించారు.

స్వతహాగా శాడిస్టులైన అలాంటివాళ్ళకి అనూరాధలాంటి అమ్మాయిల కన్నీళ్ళు మాత్రమే దాహాన్ని తీర్చగలవు.

ఎదుటి మనిషి సమస్యలని- కష్టాలని పట్టించుకోని జనాలు ఆ మనిషి సంతోషానికి కారణం తెలుసుకోవటానికి ఉత్సాహపడతారు.

రానురానూ, దేశం ప్రగతికి అభిముఖంగా పయనిస్తోన్నా వ్యక్తులు మాత్రం స్వభావరీత్యా పశుప్రవృత్తికి దూరంకాలేకపోతున్నారు.

ఈ జనారణ్యంలో ఒంటరి ఆడదాని జీవితం కత్తిమీద సాము. అసలామె వంటరిగా బ్రతకవలసిన అవసరం కలిగిన పరిస్థితులెలాంటివో ఎవరికీ అవసరం లేదు. ఆమె సమస్యలతో ఎవరికీ పనిలేదు.

కానీ వంటరిగా ఉంటోన్న ఈమె ఇంత సంతోషంగా ఎందుకుంది? ఎలా ఉంది- తెలుసుకుని, అభిమాన ధనురాలైన గౌరవనీయురాలైన ఆ స్త్రీని బజారు పాలు చేయటానికి మాత్రం అందరూ పాత్ర వహించగలరు.

వీళ్ళంతా పాపం తను వంటరిగా వాళ్ళ కాలనీలో ఉండటానికి పర్మిషన్ ఇచ్చారుట. కానీ తనింటికి ఎవరూ రాకూడదట. నెలనెలా అద్దె కడుతూ, కష్టపడి తన బ్రతుకు తను బ్రతుకుతూ, ఎలా బ్రతకాలి? అన్న విషయంలో వీళ్ళందరి అనుమతి కావాలిట.

అందరు వయసొచ్చిన ఆడపిల్లలున్న కాలనీలో తను వంటరిగా ఉండటమే కాక తనింటికి మగవాళ్ళు రావడం మర్యాద కాదట. మిగతా ఆడపిల్లలు చెడిపోతారుట.

ఒంటరిగా ఉన్న ఆడది కేవలం వ్యభిచారిణి క్రింద లెక్క... పదిమంది

బ్రహ్మచారులు కలిసి ఉండచ్చు. పదిమంది కన్నెపిల్లలు కలిసి ఉంటే మాత్రం అదొక బ్రోతల్ హౌస్.

తన ఇంటికొచ్చే ప్రతివారి పేర్లు, అడ్రస్‌లూ, ఫోన్ నెంబర్లూ ఎంక్వైరీ...

ఇలా మాట్లాడిన ఇక్కడున్న ప్రతి మగాడూ అనూరాధ అవకాశం ఇస్తే వాడుకోటానికి ఏమాత్రం వెనుకాడడు. వాళ్ళంతా నీతివాక్యాలు చెబుతున్నారు ఆహా! ఎంత హాస్యాస్పదం!

ప్రేమలేఖలు రాసి పెళ్ళాం చూడకుండా పార్శిల్ చేసిన ఓ పెద్ద మనిషి– నాగరికత ముసుగులో నిలబడి తనకు లొంగని– తన వలలో పడని అనూరాధని ఓ వేశ్యగా చిత్రించి "వాడికి" నూరిపోస్తాడా? ధైర్యంగా ఎదుర్కోలేని 'కొజ్జా' తన హిపోక్రసీకి ఈ లోఫర్‌ని వాడుకుంటాడా?

కండలూ, గడ్డాలూ పెంచేసిన ప్రతి మొగాడూ మొనగాడ్ననుకుని మురిసి పోతుంటే, ఆ గూండాలని పోషిస్తూ ఆ గూండాలకి సలాంలు కొడుతూ బానిస బ్రతుకులు బ్రతికే ఈ జనాలు వాడికి సపోర్టా?

ఏ సిటిజన్ ఇంటికీ ప్రత్యేక కారణం లేకుండా పోకూడదన్న కనీస జ్ఞానంలేని కానిస్టేబుల్ ఈ 'గూండా' వెళ్ళి పిలవగానే వావి వరసలు తెలుసు కోకుండా, తన ఇంట్లో కూర్చుని మాట్లాడుతోన్న తమ్ముడు లాంటి సుధీర్‌ని స్టేషన్‌కి తీసికెళ్తాడా? అది చూసి వీళ్ళంతా "అబ్బా మొనగాడు రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నాడని" భజన చేస్తారా?

అంటే ఈ కాలనీలో ఉన్నది ఒకే ఒక మగాడు... "వాడే". మిగతావాళ్ళంతా కొజ్జాలే.

తెల్లవారి లేచిందగ్గర్నించీ మొగుడి కళ్ళతో ప్రపంచాన్ని చూస్తూ, మొగుడి బ్రెయిన్‌తో ఆలోచిస్తూ ఆ మొగుడు నానా గడ్డీ కరిచి సంపాదించి తెస్తోంటే విలాసాలు చేస్తూ విచిత్రంగా బ్రతికే ఇల్లాళ్ళు... సాటి స్త్రీకి జరిగిన అవమానానికి సిగ్గు పడాల్సింది పోయి, ఆమెని అంటరానిదానిగా చూస్తారా? వీళ్ళంతా చాలా పవిత్రులు... పాపం అరుంధతులూ, సతీసావిత్రులు.

వీళ్ళందరికీ తనకీ, ఆనంద్‌కీ మధ్య ఉన్న బంధుత్వం అర్జంటుగా తెలియా లిట. తెలియకపోతే!

ఆనంద్ అదృష్టమో! దురదృష్టమో ఈ సంఘటన జరిగేటప్పటికి లేడు. కాంప్ కెళ్ళాడు. ఈరోజు రావాలి. స్త్రీ పట్ల కామదృష్టే గల ఈ మూర్ఖులకి తెల్లారి లేచిం దగ్గర్నించీ అవినీతి బురదలో దొర్లుతూ, శవాల మీద చల్లిన చిల్లర

ఏరుకు బ్రతికే ఈ నీచులకి... తనకీ ఆనంద్‌కీ మధ్యనున్న మమతానురాగాల సున్నితమైన అనుబంధం ఎలా చెబితే అర్థంకాగలదు? స్త్రీపురుషుల మధ్య "సంబంధాలే" కాక "అనుబంధాలు" కూడా ఉంటాయని, ఆ అనుబంధం విలువ ఏ కొలమానానికీ అందనిదని చెబితే మాత్రం ఎలా తెలుస్తుంది?

నిత్యం కాట్ల కుక్కల్లా కొట్టుకుంటూ రాత్రి అవగానే పశువుల్లా దొర్లే ఈ జనాలకి, ఈ అనూరాధ గుండెలో ప్రేమ జల్లుల మధ్య చివురించి వలపుల జడివానలో విరిసి గుబాళించే గులాబీల పరిమళం... విలువ ఎలా తెలుస్తుంది?

అనూరాధ ఆఫీసులో అడుగుబెట్టింది.

రోజూ 'గుడ్‌మార్నింగ్' చెప్పే ప్యూను హాయిగా సిగరెట్ కాల్చుకుంటూ నిర్లక్ష్యంగా చూశాడు.

అంతవరకూ అదృష్టమే... కన్ను కొట్టలేదు.

కొలీగ్స్ చాలా బిజీగా ఉన్నట్టు ఫైల్స్‌లోకి తలలు దించేసుకున్నారు.

రోజూ ఆశగా చూసే పరాంకుశం చూపుల్లో ఆకలి- వసంత, కుమారి, రాణి, కమల వారపత్రికల్లో అర్జంట్‌గా మునిగిపోయారు.

ఆఫీసుకి ఎందుకొస్తున్నాం? అన్న కర్తవ్యాన్ని విస్మరించి తీరుబడిగా పదకొండు గంటలకి వచ్చి, వచ్చిందగ్గర్నించీ మూడెప్పుడౌతుందా? అని గడియారం కేసి చూస్తూ "సింప్లీ సిటింగ్... మంత్లీ టేకింగ్" అన్నట్టు నెలనెలా జీతాలు కరెక్ట్‌గా లెక్క చూసుకుని మాట్నీలకు, షికార్లకు తిరిగేవాళ్ళు కూడా తనని అసహ్యించుకునే స్టాండర్డ్‌కి ఎదిగారా? హౌ వండర్?

ఒక్క రాత్రిలో కేవలం పన్నెండు గంటల్లో... నో! నో! (కేవలం పన్నెండు గంటలేవిటి? పిచ్చి- అరగంట చాలు చెడు వ్యాప్తి చెందడానికి) ఇక్కడిదాకా వ్యాపించింది ఓ నాగరిక యువతికి ఆటవికులు చేసిన అవమానం. ఆ అవమానాన్ని అనాగరిక చర్యని ఎంత ఆర్భాటంగా రిసీవ్ చేసుకున్నారు? ఎంత ఘనంగా ఆహ్వానం పలికారు? వీళ్ళంతా సంస్కారులు... సభ్య ప్రపంచంలో మెలిగేవారు కదా!

రెడ్‌హాండెడ్‌గా పట్టుపడిందట.

"ఛీ... సిగ్గులేకుండా ఆఫీసుకొచ్చింది."

"ఇంకెవరన్నా అయితే నుయ్యో, గొయ్యో చూసుకునేవారు. తెగించినవారికి తెడ్డే దిక్కట..."

అనూరాధ కళ్ళల్లో నిప్పులు రాలాయి.

చివ్వున వెనక్కి తిరిగింది.

"రెడ్‌హాండెడ్‌గా పట్టుబడిందిట... మనముందు పతివ్రతలా నటన" రోజూ తనకి చిరునవ్వుతో విష్ చేసే రామేశం అంటున్నాడు.

"మిస్టర్ రామేశం!" అనూరాధ కంఠంలో డైనమైట్ పేలిన ధ్వని.

"దేర్ ఈజ్ లాట్ ఆఫ్ డిఫరెన్స్. బిట్వీన్ యాస్ అండ్ హార్స్ యు జస్ట్ డిసైడ్ వెదర్ యూ ఆర్ ఏన్ యాస్ ఆర్ హార్స్-"

అతను తేరుకునేలోగా అనూరాధ ఆటోలో ఉంది.

తట్టుకోలేని వాతావరణం.

కళాకారిణి, భావుకురాలు... స్నేహమయి... ప్రేమమయి... అనూరాధ భరించలేని వాతావరణం... ఆ విషవాయువుల ప్రభంజనంలో చిగురుటాకులా... అనూరాధ.

అనూరాధలాంటి స్త్రీ వంటరిగా బ్రతక్కూడదు. అందంగా అలంకరించుకోకూడదు. ఎవరితో నవ్వుతూ మాట్లాడకూడదు. మగవాళ్ళతో అన్నగానీ, తమ్ముడుగానీ, స్నేహితుడుగానీ, పరిచయస్తుడుగానీ, ప్రియుడుగానీ, బావగానీ, మరిదిగానీ, ఆఖరికి గడ్డాలూ, మీసాలూ వచ్చిన కొడుకైనా సరే... వాళ్ళతో వంటరిగా స్కూటర్‌ల మీద ఎక్కడికీ వెళ్ళకూడదు. ఎంత గొప్ప సమాజం ఇది? ఎంత సంస్కారం ఈ మనుషుల్లో?

ఆడదాని కన్నీటికి కారణం అడగని ఈ జనాలు చిరునవ్వుకి సవాలక్ష ప్రశ్నలేస్తారు.

ఓ ఆడది భర్త పెట్టే చిత్రహింసలు భరిస్తూ కాపురం చేస్తేనో, ఆత్మహత్య చేసుకుంటేనో సానుభూతి చూపుతారు. ఆమె అతణ్ణి వదిలేస్తే చెడిపోయిందంటారు.

ఎంత చిత్రమైన స్వభావాలివి?

మెళ్ళో సూత్రాలు... కాళ్ళకు మట్టెలు ధరించి వ్యభిచారం చేస్తే కూడా పతివ్రతంటారు.

అవేమీ లేకుండా ఓ మగవాడ్ని ప్రేమించి, అతనికే కట్టుబడి ఉండి... అతనే లోకంగా అతనే దైవంగా భావించి బ్రతికితే ఆ ఆడది పతిత... ఉంపుడుగత్తె.

ఆడది తనకోసం తను బ్రతక్కూడదు. ఈ సమాజం కోసం సమాజం నిర్దేశించిన విధంగా బ్రతికితేనే మంచిది.

నో! తను అలా బ్రతకదు. పెళ్ళి అనే అర్థంలేని తతంగంతో ఓ మగవాడికి

బానిసై బ్రతికే కన్నా నచ్చిన వ్యక్తికి స్నేహితురాలిగా, ప్రేయసిగా బ్రతకడమే తన కిష్టం. అవును- ఈ జీవితం తనది. తనకిష్టం వచ్చినట్టు బ్రతికే అధికారం తనకుంది. వీళ్ళంతా ఎవరు తనని శాసించటానికి- ప్రశ్నించటానికి- కట్టడి చేయటానికి.

ఆనంద్‌తో తను కలిసి తిరిగిందని- కలిసి బ్రతుకుతోందని వావీ వరసలు లేకుండా ఇంటికొచ్చిన ప్రతి మొగాడితో సంబంధం అంటగడతారా?

రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నాట్ట ఆ మొనగాడు.

ఈ కొజ్జాలు మురిసిపోతున్నారు.

రెడ్‌హాండెడ్ అంటే? తను ఎవరెవరితోనో పడుకుని ఉండగా పట్టికెళ్ళారా? అణాకానీ వెధవలు, విషయావగాహన లేకుండా అనేయడమే.

అసలు స్టేషన్‌లో ఏం జరిగిందో! ఇన్‌స్పెక్టర్ 'వాడిని' ఎలా బూతులు తిట్టాడో వీళ్ళకి తెలీదు. తను స్టేషన్‌కి వెళ్ళిందనే తెలుసు. సంస్కారం ఉంది కాబట్టి ఆ ఇన్‌స్పెక్టర్ 'వాడ్నే' తిట్టి మళ్ళీసారి వస్తే కాళ్ళు విరగ్గొడతానని పంపించాడు.

దానిని కథలు కథలుగా అల్లుతున్నారు ఈ గ్రంథకర్తలంతా. తనని ఆఫ్ట్రాల్ వీళ్ళంతా వెలేస్తారా? గొప్ప నీతిమంతులు వీళ్ళెవరు తనని వెలేయడానికి. తనే అందర్నీ వెలేస్తోంది. "లెట్ దెమ్ గో టు హెల్" తన ఆనంద్ ఒక్కడు తనని అర్థం చేసుకుంటే అంతే చాలు. ఆనంద్ లేనప్పుడు ఈ సంఘటన జరగటం తన దురదృష్టం. ఆనంద్‌కీ తన మీద సంపూర్ణ విశ్వాసం ఉంది. కానీ ఒక్కోసారి పరిస్థితులు మనిషిలోని వివేకాన్ని చంపేస్తాయి. తన ఆనంద్ అలా వివేకరహితుడు కాకుండా ఉంటే చాలు అంతా నమ్మారు... అసలు విషయం తెలుసుకోవాలన్న ఇంగితం లేకుండా నమ్మారు.

ఆనంద్ కూడా ఈ సమాజంలో మనిషిగా కాక తన మనిషిగా ఆలోచిస్తే అంతే చాలు.

చదువు సంస్కారాలు ఉన్న ఈ గూండామీద జనానికి ఎంత కాన్ఫిడెన్స్! నిజమే! ఇది గూండాల చేత గూండాల వలన గూండాల కోసం నిర్మించబడ్డ సమాజం. ఈ సమాజంలో చదువు, హోదా, సంస్కారం- పరపతి- అంతస్తు ఉన్నవాళ్లు కాదు వి.ఐ.పీ.లంటే. గడ్డాలూ, మీసాలూ భయంకరంగా పెరిగి కండలు తిరిగిన వస్తాదులు. వీలైనంత కిరాతకంగా ప్రవర్తించేవాళ్ళే వి.ఐ.పీ.లు.

ఇంట్లో అడుగుపెట్టి రేడియో ఆన్ చేసింది. విలవిల్లాడే మనసుకి ఊరట

కావాలి. ఎలా? ఆనంద్ రాలేదు. వస్తాడా? ఈ సంఘటన ఊళ్ళోకి రాగానే తెలిసిందా? తనూ అసహ్యించుకుంటున్నాడా?

"పులిని చూస్తే పులి ఎప్పుడు జడవదు. మేకవస్తే మేక ఎన్నడూ అదరదు. మాయరోగ మదేమో కానీ మనిషి మనిషికీ కుదరదూ!"

రేడియోలో పాట... అనూరాధ పెదాలపై జీవంలేని నవ్వు...

"అనూ!" కాలుతోన్న గుండె మీద నవనీతం రాసినట్టు పిలుపు.

"ఆనంద్!" శ్రావణ మేఘంలా చలించింది.

"ఊరుకో ప్లీజ్... నీకేమీ అవమానం జరగలేదుగా! వాడికే కదా అవమానం జరిగింది. నాకంతా తెలిసింది. ఇన్‌స్పెక్టర్ గార్ని కలిశాను."

"కానీ... కానీ.. ఆ విషయం ఎవరికీ తెలీదు. వాడు ఆ గాడిద హాయిగా తిరుగుతున్నాడు."

"పిచ్చిదానా! ఈ సమాజానికి గుర్రాలే కాదు, గాడిదలు కూడా అవసరమే. గాడిద పాలు శ్రేష్టమైనవని మహానుభావులే తాగారు. బరువు మోయడానికి గాడిదలు కావాలి. వాటిని బ్రతకొద్దంటే ఎలా?"

"కానీ... కానీ... నేనిక్కడ ఉండలేను ఆనంద్! నన్నిక్కడి నుంచి తీసికెళ్ళిపో! ప్లీజ్."

"ఎక్కడికెళ్ళినా ఇవే మనస్తత్వాలు. ఎంత దూరం వెళ్ళగలం చెప్పు? నువ్వు నీ జీవితాన్ని ఓ చిత్రమైన రీతిలో, తరతరాల ఆచారాలకు, సంప్రదాయాలకు విరుద్ధంగా మార్చుకోటానికి ప్రయత్నిస్తున్నావు. వివాహం అనే సంప్రదాయానికి భార్యాభర్తల అనుబంధానికి సరికొత్త నిర్వచనం కల్పిస్తూ యాంత్రికమైన సంసారాల్లో ఓ కొత్త వరవడి సృష్టించాలని ప్రయత్నిస్తున్నావు. నీ భావాలను అర్థం చేసుకుని నీ జీవన రీతిని ఆకళింపు చేసుకుని అంగీకరించే సంస్కారం వీళ్ళలో అంత త్వరగా ఎలా కలగగలదని ఆశిస్తున్నావు? ఈ సమాజంలో ఉన్న ఎన్నో దురాచారాలు, మూఢనమ్మకాలు ఇంతవరకూ తొలగిపోలేదు. మహానుభావులు చేసిన సంస్కరణలనే జీర్ణం చేసుకోలేని ఈ ప్రజలు... నిన్ను అర్థం చేసుకోటానికి ఎన్ని శతాబ్దాలు గడిచినా నువ్వు ఆశ్చర్యపోకూడదు.

ఈ సమాజం నిన్ను అర్థం చేసుకుందా? లేదా? అన్నది కాదు సమస్య. ఈ సమాజాన్ని నువ్వెంతవరకు అర్థం చేసుకున్నావు అన్నది ప్రధానం. వీళ్ళందరికీ అర్థమయ్యేలా నువ్వూ ప్రవర్తిస్తున్నావా? లేదా అన్నది కూడా ముఖ్యమే. ఈ సమాజాన్ని చూసి మనం భయపడి పారిపోకూడదు. వీలైనంత మటుకు అందరినీ

కన్విన్స్ చేయటానికి ప్రయత్నించాలి. నీలో ఆత్మవిశ్వాసం, మనస్సాక్షి వున్నంత వరకు ఒడిదుడుకులను స్వీకరిస్తూ, త్రోసిపుచ్చుతూ నీవెంచుకున్న గమ్యం చేరడానికి మార్గాన్ని సుగమం చేసుకోవాలి.”

అతని మృదుమధుర స్వరం, అతని స్పర్శ ఉపశమనం కలిగిస్తోంటే వివశురాలై వింటూ అతని గాఢ పరిష్వంగంలో కళ్ళు మూసుకుంది అనూరాధ.

***

*(మార్చి 1992, ఆంధ్రభూమి)*